# కథ

# "ధర్మగ్లాని"

రావి-ఎన్-అవధాని

"పొద్దు పొడిసే సరికి ఊరంతా గుప్పు మందండి!" "అట్టుడికి నట్టు ఉడికి పోనాదండి!" "ఇదేవన్నా సిన్నయిసయవేటి? నువు సెప్పండి!" "రామోరం అగ్గివోత్తరం నాటి అగ్గురారవండి!" "నిప్పును కడిగే ఆసారవండి జనాలది!" "మరండీ! ముకుందం గోరు ఆసారం మట్టిల గలిపీసినారు"

"అవును! ఆరేనండి! మేట్టరు ముకుందం గోరేనండి" "మరి సెమించి పల్లకుండనేవండి! సదూకున్నోరు సదువు సెప్పేవోరే అట్టాంటి పని సెయ్యడవేటి సెప్పండి"

"ఈ పొద్దు ఆరు సేసేరని రేపు మరోడు నెగుస్తాడు"

"గేమం కట్టుబాటు సెడిపోతాదండి"

"మరేవండి!"

"అంచాత ఎంటనే పంచాయతీ ఎట్టి యిసయవేటో తేల్చాల!"

"గ్రామంలో ప్రతి ఒక్కరూ ఇదే మాట. ఐవేగుస గుసలు.

రామవరం ఆరొందల గడప అగ్రహారం.

గ్రామంలో అన్నీ పక్కా ఇళ్లే! సిమెంటు రోడ్లు. మురుగునీరు కాలువలున్నాయి. రక్షిత మంచి నీటికొళాయిలున్నాయి. హైస్కూలు, పోస్టాఫీసు, బ్యాంకు, పోలీస్‌స్టేషన్ వగైరా అధునాతన సౌకర్యాలున్నాయి. గ్రామ ప్రజలంతా ఒకే కుటుంబంలోని వారివలె కష్టసుఖాల్లో పాలుపంచుకొంటారు. తగవులు, కొట్లాటలు. వ్యాపార లాభనష్టాల లావాదేవీలు వగైరాలన్నీ గ్రామ పెద్దలు పరిష్కరిస్తుంటారు. వారి తీర్పుకు అందరూ కట్టుబడి ఉంటారు అది ఆ గ్రామ కట్టుబాటు.

రామవరం హైస్కూల్లో ముకుందం ఇంగ్లీషు, లెక్కల టీచరు. ఒంటరివాడు. తల్లిదండ్రులు, తోబుట్టువులు దగ్గర బంధువులు లేరు.

పది సంవత్సరాల క్రితం రామవరం వచ్చాడు. సుబ్బమ్మగారింట్లో రెండుగదులు అద్దెకు తీసుకొని ఉంటున్నాడు. సుబ్బమ్మగారికి మండువా వాకిలి ఇల్లుంది. ఆవిడ వయస్సు 60 ఏళ్లు. ఆమె భర్త సదాశివశాస్త్రి రెండేళ్ల క్రితం చనిపోయారు. వారికి సంతానం లేదు.

గ్రామంలో ఆవిడకు పదిఎకరాల మాగాణీ ఉంది. దాని మీద వచ్చే ఆదాయం ఆవిడకు జీవనాధారం. సుబ్బమ్మగారికి మడి, తడి, ఆచారం ఎక్కువ.

ముకుందం బుద్ధిమంతుడని, దైవభక్తి కలవాడని, సనాతన ఆచారాలు పాటిస్తాడని తెల్సుకొని అతనికి ఇల్లు అద్దెకు యిచ్చింది సుబ్బమ్మగారు.

ముకుందం చిత్రమైన వ్యక్తి. మనిషి ఎంతో చురుకు. మిత భాషి. ఎవరితోనూ చనువుగా ఉండడు. ఇతరుల విషయాల్లో తలదూర్చడు. ఎవరి జోలికి వెళ్లడు.

పిల్లలకు పాఠాలు చెప్పడంలో కడు నేర్పరి. అతని సబ్జెక్టుల్లో ఏ విద్యార్థికీ 60 మార్కులకి తక్కువ రావు. విద్యార్థులకి అతను దైవసమానుడు.

అతను వచ్చిన క్రొత్తలో ఎందరో విద్యార్థుల తల్లిదండ్రులు అతని వద్దకు వచ్చి-

"మీరు కోరినంత సొమ్మిస్తాం మా పిల్లలకు ట్యూషన్ చెప్పమని కోరారు

ట్యూషన్లకి అతను వ్యతిరేకి. క్లాసులో టీచర్ చెప్పే పాఠాలు శ్రద్ధగా వింటే ట్యూషన్స్ అనవసరం అంటాడు. చదువు మీద శ్రద్ధలేని వారికి ట్యూషన్లు పెట్టినా ప్రయోజనం ఉండదు.

డబ్బుకు ఆశించి క్లాసులో పాఠాలు సరిగా చెప్పకుండా విద్యార్థులను ట్యూషన్లకి ప్రోత్సహించడం అతని పద్ధతి కాదు. అతని శిక్షణలో విద్యార్థులకు మంచి మార్కులు రావడమే కాదు ఆ స్కూలుకి జిల్లాలోనూ రాష్ట్రంలో మంచి పేరు వచ్చింది.

సుబ్బమ్మగారికి వేరే మగదిక్కు లేనందువల్ల ఆవిడ వ్యవహారాలన్నీ ముకుందమే చూస్తున్నాడు. ఊర్లో రైతులు తమ పొలాల్లో పండిన కాయ, పండు, కూరకాయలు ఉచితంగా ఏమిచ్చినా తీసుకోడు.

ముకుందం వేకువనే లేచి స్నానంచేసి సంధ్యావందనం జపం చేస్తాడు. తరువాత వంట చేసుకొని పదిగంటలకి భోజనం చేసి స్కూలుకి వెళ్తాడు. సాయంత్రం స్నానం సంధ్య, జపం వంట. తీరిక సమయంలో చదువుకోవడం, రాసుకోవడం అతని దినచర్య కాఫీ, టీ లాంటివి తీసుకోడు.

అతని గుణగణాలు, రూపురేఖలు, మంచితనం నిశితంగా పరిశీలించిన ఎందరో ఆడపిల్లల తల్లిదండ్రులు తమ పిల్లను పెళ్లి చేసుకోమని కోరారు. చుట్టు ప్రక్కల గ్రామాల నుండే గాక పట్నం నుండి కూడ మంచి సంబంధాలు వచ్చాయి. కొందరు సుబ్బమ్మగారి చేత చెప్పించారు.

"అమ్మా! నాకు కొన్ని బాధ్యతలున్నాయి! అవి నెరవేర్చందే పెళ్లి మాట తలపెట్టను" అన్నాడు.

"ఒంటరివాడివి! తల్లిదండ్రులు, తోబుట్టువులు లేరు అన్నావు! మరినీకు బాధ్యతలేంటి? అని నిలదీశారు.

"అమ్మా! సమయం వచ్చినప్పుడు మీకు అన్నీ వివరంగా చెప్తాను. అంతవరకూ నన్ను బలవంతం చెయ్యకండి!" అన్నాడు.

ఒకరోజు ముకుందం పట్నం వెళ్లి సాయంత్రం సంధ్యాసమయంలో ఒక అమ్మాయిని వెంట పెట్టుకు వచ్చాడు. ఆమె వయస్సు పాతిక సంవత్సరాలు. వసిమిచాయ. మెడలో మంగళసూత్రం, చేతులకు గాజులు, కాళ్లకు మట్టెలు, నుదుట కుంకుమ బొట్టు లేవు.

బస్సుదిగిన వారిరువురినీ కుంటి వెంకడు చూశాడు. కుంటివెంకడు ఊరి పొలిమేరలో బస్సుస్టాండు వద్ద జంతికలు, చేగోడీలు, అమ్ముతుంటాడు. వాడిది డేగ చూపు. వాడు ముకుందానికి దండం పెట్టి లగేజీ తీసుకొని వెళ్లడానికి కర్రి జోగయ్యను కుదిర్చాడు.

ముకుందం ఆమెను వెంట తీసుకురావడం చూసిన వాడికి ఆయన మీద చెడు అభిప్రాయం కలిగింది. వాడు వెంటనే ఊరంతా గుప్పు మనిపించాడు.

మసక వెలుతురులో ముకుందం వెనుక భుజాల నిండుగా పైటచెంగు కప్పుకొని తలవంచుకొని వస్తున్న అమ్మాయిని గ్రామ ప్రజలంతా వింతగా చూశారు. రాముని వెంట వనవాసానికి వెళ్తున్న సీతమ్మలా ఉంది అనుకున్నారు.

"ఆమె ఎవరు? ఆమెకూ నీకూ సంబంధం ఏమిటి అని అడగటానికి ఎవరూ సాహసించలేదు. గుసగుసలు ప్రారంభమయ్యాయి.

ముకుందానికి పెళ్లి కాలేదు. ముందూ వెనుకా లేరు మరి ఈ అమ్మాయి ఎవరని చర్చలు ప్రారంభమయ్యాయి. కుంటి వెంకడు ఆజ్యం పోసాడు.

సామాన్లు గదిలో పెట్టించి ముకుందం ఆమెను సుబ్బమ్మగారి వద్దకు తీసుకెళ్లి–

"అమ్మా! ఈమె పేరు సుశీల! ఇకమీదట ఇక్కడే ఉంటుంది. తన వివరాలన్నీ మీకు భోజనాలయిన తరువాత నిదానంగా చెప్తుంది" అన్నాడు.

సుశీల ఆవిడకు నమస్కరించి దీవెనలందుకుంది.

'చూడు ముకుందం! మీరు ప్రయాణం చేసి అలిసి వచ్చారు. ఇప్పుడు వంట ప్రయత్నం చెయ్యకు. నువ్వు స్నానం చేసి జపం అయ్యేసరికి నేను మీకోసం అత్తెసరు పడేస్తాను" అన్నారు.

ముకుందం ఏ కళనున్నాడో కాదనలేదు. మర్నాడుదయాన్నే ఇరుగు పొరుగు అమ్మలక్కలు సుబ్బమ్మగారి వద్దకు వచ్చారు. ఆ అమ్మాయి వివరాలు సేకరించడానికి!! మా బంధువులమ్మాయి చుట్టం చూపుకి పట్నం నుండి వచ్చింద"ని సుబ్బమ్మగారు లౌక్యంగా అన్నారు.

ఆవిడ మాటలు ఎవరూ నమ్మలేదు. ఊర్లో జనాలు గ్రామపెద్దల్ని పంచాయతీ పెద్దల్ని కలిసి విషయం చెప్పి పంచాయతీ పెట్టమని బలవంతం చేశారు.

గ్రామపెద్దలకు ముకుందం మీద ఎనలేని గౌరవముంది. అతను తప్పుడు పని చెయ్యడనే విశ్వాసముంది. అటువంటి వ్యక్తిని పంచాయతీకి రమ్మని ఎలా చెప్పాలో పాలుపోక తర్జన భర్జన పడుతున్న తరుణంలో ముకుందం వారి వద్దకు వెళ్లి పంచాయతీ పెట్టించమన్నాడు.



కవి యాకూబ్‌కు ఉమ్మడిశెట్టి సాహితీ అవార్డును ప్రదానం చేస్తున్న అవార్డు వ్యవస్థాపకులు డా॥ రాధేయ మరియు ఆచార్య కొలకలూరి ఇనాక్, కవయిత్రి శిలాలోలిత గార్లు పాల్గొన్నారు.

"ఎందుకు మాస్టారూ! అనవసరం! మీరు ఎలాంటివారో మాకు తెలియదా? మీరు ఎన్నడూ తప్పుడు పని చెయ్యరనే నమ్మకం మాకుంది. ఇంతకూ ఆమె ఎవరూ? సుబ్బమ్మగారి బంధువా? అన్నారు లౌక్యంగా.

ఆ వివరాలన్నీ పంచాయతీలో చెప్తాను అన్నాడు

పంచాయతీకి గ్రామపెద్దలు, ఊర్లో జనాలు, పొరుగూరివారూ వచ్చారు. సుబ్బమ్మగారి వెంట సుశీల వచ్చింది. ముకుందం లేచి నిల్చుని అందరికీ నమస్కరించి

"ఈ అమ్మాయి పేరు సుశీల. నిన్న సాయంత్రం పట్నం నుండి నా వెంట తీసుకొచ్చాను. సుశీల తన వివరాలు, ఆమెకు నాకూ ఉన్న సంబంధం మొదలైన విషయాలు చెప్తుంది." అన్నాడు.

సుశీల వినయంగా అందరికీ నమస్కరించి "మాది వెంకటాపురం అగ్రహారం! మా తాతగారు శివరామశాస్త్రిగారు. వేదపండితులు. నాకు చిన్నప్పుడే వివాహమైంది నెల తిరక్కుండా వైధవ్యం వచ్చింది. ఆ దిగులుతో నా తల్లిదండ్రులు పోయారు. మా తాతగారు నన్ను చేరదీసి సంస్కృతం పంచకావ్యాలు చెప్పారు. మా ఊర్లో హైస్కూల్లో చేర్పించారు టెన్త్‌క్లాసు స్టేటు ఫస్ట్ వచ్చాను."

"ముకుందంగారు మా తాతగారి వద్ద చిన్నప్పుడు వేదం, సంస్కృతం నేర్చుకుని తరువాత ఎమ్.ఏ. చదివి ఈ ఊరి స్కూల్లో టీచరు ఉద్యోగంలో చేరారు. తన మొదటినెల జీతం అందుకొని మా తాతగార్ని చూడ్డానికి వచ్చారు. అతను వచ్చేసరికి మా తాతగారు జబ్బుపడి చివరిదశలో ఉన్నారు. నా బాధ్యతలు వీరికి అప్పగించి కన్ను మూశారు."

"వారివలే నేనూ ఏకాకి నయ్యాను"

"ఏం చేద్దామనుకుంటున్నావు" అని నన్నడిగారు "వారు సడన్‌గా అలా అడిగేసరికి నేను కంగారు పడ్డాను చదువుకుంటాను అన్నాను అప్రయత్నంగా"

"వారు మరో ఆలోచన చెయ్యకుండా పద అని నన్ను పట్నం తీసుకెళ్లి కాలేజీలో జాయిన్ చేసి హాస్టల్‌లో చేర్పించి చదివించారు. నేను ఎమ్.ఏ. తెలుగు లిటరేచర్‌లో బంగారు

పతకం తెచ్చుకున్నాను. ఎంతో ప్రయత్నించి ఈ ఊరి హైస్కూల్లో టీచరు ఉద్యోగం ఇప్పించారు." అంటూ తన వివరాలు చెప్పింది.

ఆమె దీనగాథ విన్న గ్రామ పెద్దలు జనాలు చలించిపోయారు.

ముకుందం ఆమెకు చేసిన సహాయానికి అతన్ని అభినందించారు. అతను పెళ్లిమాట తలపెట్టకుండా తన బాధ్యత నెరవేర్చి గురువుగారికిచ్చిన మాట నిలబెట్టేడని అతని ఆదర్శాన్ని కొనియాడేరు ప్రజలు.

"చూడు అమ్మా! సుశీల! ముకుందం తన సుఖసంతోషాలను విడిచి నీ చదువు కోసం ఎంతో సహాయం చేసి నీకు జీవితాన్ని ప్రసాదించిన మహనీయుడు అతనికి జీవితాంతం తోడుగా ఉండేందుకు అతడిని వివాహం చేసుకొని నీ బాధ్యత నెరవేర్చు అన్నారు.

"మీరు చెప్పింది నిజమే! ముకుందంగారు నాకు జీవితం ప్రసాదించిన మహనీయుడే ! వారు నాకు దైవం! రోజూ నేను వారికే ఉదయాన్నే మనస్సులో నమస్కరిస్తున్నాను".

"ఈ పంచాయతీలో పండితులు, శాస్త్రవేత్తలు ధర్మ రక్షణకు కంకణం కట్టుకున్నవారూ యీ విధంగా సంకుచిత భావంతో ధర్మహానిని ప్రోత్సహిస్తా రనుకోలేదు."

"ముకుందంగారు నాకు చేసిన సహాయానికి వారికి నా మనస్సులో గుడి కట్టుకొని జీవితాంతం పూజించడానికి బదులు వారిని నా మెడలో తాళి కట్టమనడం నీచమైన ఆలోచన! అన్న సుశీల మాటలు తూటాల్లా తగిలాయి జనాలకి. గ్రామ పెద్దలకు.

# యాహూ డాట్ కామ్

## కొల్లూరి

మట్టిలో కూరుకుపోతున్న మానవీయం
నిజాయితీకి కాలం చెల్లినలోక లోలకం
సత్యాసత్యాలకు నెట్‌వర్క్ కరువైపోతుంది!
గుండెల మీద చేయి వేసుకుని చెప్పే నిజాలన్నీ
రహస్య అబద్ధాలు
నాలుక చివర పలుకులన్నీ అపశృతులే!

జీవితం యాదృచ్ఛికం
ప్రేమించడం యాంత్రికం!
బంధాలన్నీ మటుమాయం!
వాడిపాడేసిన బొమ్మే... అమ్మ కూడా!
బొమ్మని షోకేస్ అలంకార ప్రాయంగా అమర్చుకున్నట్లు
అమ్మని కూడా ఓల్డేజ్ హోంలో బద్రపరుచుకుంటున్నాం
నాడు ఆరోగ్యం మహాభాగ్యం
మహాభాగ్యమే ఆరోగ్యమైపోయింది
దినచర్యలన్నీ ఆన్‌లైన్‌మీద!
బ్రతుకు కలలన్నీ ఎటియం మీదే
నేడు వంశాన్ని నిలబెట్టుకోవటం అంటే
వీసా పాస్‌పోర్టులు తెచ్చుకుని, విదేశాలకు పంపేయటమే!
రిలయన్స్‌ఫ్రెష్‌లో సరుకులు కొనుక్కుంటున్నట్లే.....
బంధాల్ని కొనుక్కుంటున్నాం!
ఐదేళ్ళకోసారి అమ్మ మారిపోతుంది!
అమ్మ ఆంటీ అయిపోతుంది!
పదేళ్ళకోసారి డాడీ మారిపోతున్నాడు,
డాడీ అంకుల్ అయిపోతున్నాడు!
జీవితం డాక్యుమెంట్లు, ఎగ్రిమెంట్స్
పవిత్ర బంధాలన్నీ 'నెట్' బంధాలయిపోతున్నాయి!
సంపాదన రుచి మరిగి
షడ్రుచులూ మర్చిపోతున్నాం!
పుస్తకాలన్నీ సిడి లైపోతున్నట్లు, నోట్లన్నీ డాలర్లైపోతున్నాయి.
ఫ్యామిలీ నాన్ ఎసి కోచ్ అయిపోయింది!
ఇళ్లు అపార్ట్‌మెంట్స్ జీవితం కంపార్ట్‌మెంట్స్
సెల్‌లో గుడ్ మార్నింగ్
నెట్‌లో గుడ్‌నైట్
లైఫ్ సంక్షిప్త యాహూ డాట్‌కమ్!